# ఓటు.. ఎవరికి భద్రం



## దేశమంతా హీటెక్కిస్తున్న ఎన్నికల సంఘం వివాదం

దేశంలో సగటు ఓటరు పాట్లు ఇంకా కొనసాగాల్సిందేనా అన్న ప్రశ్న ఇప్పుడు ఎన్నికల వ్యవస్థ గుమ్మం ముందే నిలిచింది. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం అవసరమే అయినా, వ్యవస్థలో తలెత్తిన తప్పులకు నిజమైన ఓటరే పత్రాలు, జిరాక్స్ కాపీలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే బాధ్యత ఎక్కడ నిలుస్తుందన్న చర్చ ముదురుతోంది. ఈసీనెట్‌పై 14 ఇంటర్నల్ అబ్జెక్షన్స్, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలు, ఎస్ఐఆర్ నోటీసులపై కోర్టు పరిశీలన, కాంగ్రెస్ ఆరోపణలు, చివరకు ఐఐటీ లేదా ఐఐఐటీ నిపుణుడితో ఇండిపెండెంట్ రివ్యూ నిర్ణయం వరకు పరిణామాలు ఎన్నికల సంఘం ట్రాన్స్‌పరెన్సీని జాతీయ చర్చగా మార్చాయి.

ఓటర్ల జాబితాలో చనిపోయినవారి పేర్లు, డూప్లికేట్ నమోదులు, అర్హతలేని ఎంట్రీలు తొలగించడం ఎన్నికల సంఘం ప్రాథమిక బాధ్యత. అదే సమయంలో చట్టబద్ధంగా నమోదై ఉన్న ఓటరును పొరపాటున బయటకు నెట్టకుండా కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా కోట్ల ఎంట్రీలు పరిశీలనకు రావడం, భారీ సంఖ్యలో పేర్లు డ్రాఫ్ట్ రోల్స్ నుంచి తొలగించబడటం వల్ల ఈ సమతుల్యతే ఇప్పుడు ప్రధాన వివాదంగా మారింది. శుద్ధి ప్రక్రియ ఎంత కఠినంగా ఉన్నా, డ్యూ ప్రాసెస్ లేకుండా ఓటు హక్కు ప్రమాదంలో పడకూడదన్న వాదనకు రాజకీయ పార్టీలతోపాటు న్యాయస్థానాల్లోనూ ప్రాధాన్యం పెరిగింది. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతే ఎన్నికల నిష్పాక్షికతకు అసలు పరీక్షగా నిలుస్తోంది.

ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం లోపల నుంచే వచ్చిన అభ్యంతరాలు సాధారణ పరిపాలనా నోట్‌లుగా మిగలలేదు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సందర్భాల్లో రికార్డుపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఓ జాతీయ ఇంగ్లీషు పత్రిక తన దర్యాప్తులో వెల్లడించింది. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, తిరిగి చేర్పు, ఓటర్ డేటాబేస్ యాక్సెస్, పశ్చిమ బెంగాల్‌లో అప్పీలు, ఫారం-6 మార్పులు వంటి అంశాలే వాటిలో ఉన్నాయి. కీలక నిర్ణయాలు తమకు తెలియకుండా జరిగాయన్న వారి నోట్లు, ఈసీఐలో నిర్ణయ ప్రక్రియ ఎలా నడిచిందన్న అంశాన్ని ప్రజా పరిధిలోకి తెచ్చాయి. అందుకే ఇవి వ్యక్తుల మధ్య భేదాభిప్రాయాలకన్నా విధానపరమైన ప్రశ్నలుగా మారాయి.

ఫారం -6 వివాదం ఈ అంతర్గత చర్చకు మరింత బలం ఇచ్చింది. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తి లేదా అతని తల్లిదండ్రులు, తాతామామల పేర్లు గత ఎస్ఐఆర్ జాబితాలో ఉన్నాయా అనే డిక్లరేషన్ ఈసీనెట్‌లో చేరడంతో చట్టపరమైన ప్రక్రియపై అభ్యంతరాలు వచ్చాయి. వివేక్ జోషి, సుఖ్‌బీర్ సంధు ఈ మార్పు రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలెక్టర్స్ రూల్స్‌ను సవరించకుండా చేయరాదని రికార్డులో పేర్కొన్నట్లు రిపోర్టులు తెలిపాయి. తర్వాత ఈసీఐ ఎస్ఐఆర్ కాలానికి వర్తించే డిక్లరేషన్‌పై సుప్రీంకోర్టు ఆమోదం ఉందని, సాధారణ కాలంలో పాత ఫారం ప్రకారమే దరఖాస్తులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. దీంతో ఫారం రూపకల్పనకే చట్టబద్ధ అనుమతి అవసరమా అన్న అంశం ముందుకొచ్చింది.

అంతకంటే తీవ్రమైన అంశం ఓటర్ డేటాబేస్ నియంత్రణ. చట్టం ప్రకారం నియోజకవర్గంలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు ఓటర్ల జాబితా నిర్వహణలో స్టాట్యూటరీ పవర్స్ ఉంటాయి. కానీ ఈసీనెట్, ఎరోనెట్ వ్యవస్థల్లో ఫీల్డ్ అధికారులకు పూర్తి యాక్సెస్ తగ్గుతోందని ఇద్దరు కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేసినట్లు దర్యాప్తు చెబుతోంది. డేటాబేస్ క్రమంగా ఢిల్లీలో కేంద్రీకృతమవుతోందని వివేక్ జోషి పేర్కొనగా, చట్టబద్ధ అధికారుల పనిని ఐటీ విభాగపు క్రెడెన్షియల్స్ పరిమితం చేయకూడదని సంధు రికార్డులో పెట్టారు. టెక్నాలజీ అధికారి చేతిని బలపరచాలా, అధికారాన్ని బదిలీ చేయాలా అన్న సరిహద్దే ఇక్కడ కీలకం.

గోవాలో బయటపడిన ఘటన ఈ టెక్నికల్ సమస్యకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అర్హులుగా గుర్తించిన 97 మంది పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైన రోల్‌బ్యాక్ సదుపాయం సిస్టమ్‌లో అందుబాటులో లేకపోవడంతో వారు ఫైనల్ రోల్ కు ... బయటపడ్డారని రిపోర్టులు పేర్కొన్నాయి. ఏడు రోజుల్లో 8 సార్లు సమస్యను పైస్థాయికి తెలియజేసినా పరిష్కారం ఆలస్యమైందని దర్యాప్తు వెల్లడించింది. తర్వాత ఈసీఐ ప్రత్యేక చర్యలు ప్రారంభించి, వారిలో చాలామందితో మళ్లీ ఫారం సిక్స్ దరఖాస్తులు తీసుకుంది. ఇక్కడ తప్పు సంఖ్యలో చిన్నదైనా, ఓటు హక్కు విషయంలో ఒక్క అర్హుడి పేరు కూడా చిన్న విషయం కాదన్న సందేశం స్పష్టమైంది.

పశ్చిమ బెంగాల్‌లో వివాదం మరో రూపం తీసుకుంది. లాజికల్ డిస్క్రెపెన్సీస్‌గా గుర్తించిన పెద్ద సంఖ్యలో ఓటర్ల విషయంలో న్యాయస్థానాల జోక్యం తర్వాత జ్యుడీషియల్ అధికారులు పునఃచేర్చిన పేర్లపై కూడా అప్పీలు దాఖలయ్యాయి. ఆ అప్పీలు ఈసీఐ తరపున ఎవరు అనుమతించారు, ఎవరు వాస్తవంగా దాఖలు చేశారు అన్న ప్రశ్నను సుఖ్‌బీర్ సంధు రికార్డులో లేవనెత్తినట్లు దర్యాప్తు తెలిపింది. తాను, వివేక్ జోషి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కూడా ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం పొందలేదని ఆయన పేర్కొన్నట్లు రిపోర్టైంది. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ సమస్య కాదు.. నిర్ణయం తీసుకునే అధికారం, బాధ్యత, ఆథరైజేషన్ ఎవరిదన్న ఇన్‌స్టిట్యూషనల్ ప్రశ్నగా మారింది.

ఇదే సమయంలో ఢిల్లీలో ఎస్ఐఆర్ నోటీసులు మరో కీలక సంకేతాన్ని ఇచ్చాయి. లాజికల్ డిస్క్రెపెన్సీ సహా వివిధ కారణాలతో 33 లక్షలకు పైగా ఓటర్లకు నోటీసులు వెళ్లిన వ్యవహారంపై సుప్రీంకోర్టు, కొన్ని నోటీసులు దాదాపు మెకానికల్‌గా జారీ అవుతున్నట్లున్నాయని వ్యాఖ్యానిస్తూ ఈసీఐ నుంచి వివరణ కోరింది. వయసు, పేరు లేదా పాత రికార్డులతో పోలికలో తేడా కనిపించినంత మాత్రాన ఓటరుపై అనవసర భారం పడకూడదనే అంశం విచారణలో ముందుకొచ్చింది. ఈసీఐ మాత్రం హియరింగ్ లేకుండా ఎవరి పేరూ తొలగించబోమని తెలిపింది. తర్వాత బూత్ లెవల్ అధికారులు ఇంటికే వెళ్లి పత్రాలు సేకరించేలా ప్రక్రియను సడలించింది.

ఇక్కడే సామాన్యుడిపై పడే అసలు ఖర్చు కనిపిస్తుంది. నోటీసు అందుకున్న నిజమైన ఓటరు పాత సర్టిఫికెట్లు వెతకాలి, జిరాక్స్ కాపీలు తీయాలి, ప్రయాణ ఖర్చు పెట్టాలి, రోజువారీ పని లేదా ఉపాధిని వదిలి అధికారుల ముందు హాజరుకావాలి. ఒకవైపు బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, ఐటీ వ్యవస్థలు, ప్రత్యేక శిబిరాల కోసం ప్రజా ధనం ఖర్చవుతుంటే, మరోవైపు అదే వెరిఫికేషన్‌కు పౌరుడు తన జేబు నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ భారాన్ని కేవలం అడ్మినిస్ట్రేటివ్ ప్రాసెస్‌గా చూడలేం. డేటా లేదా సిస్టమ్ లోపాన్ని సరిచేసే బాధ్యత పౌరుడిపైకి నెట్టబడితే అది పబ్లిక్ కాస్ట్‌తోపాటు వోటర్ బర్డెన్ సమస్యగా మారుతుంది.

ఆధార్ అంశంలోనూ ఇదే అసంతృప్తి ... కనిపిస్తోంది. ఆధార్ సమర్పణ ఎన్నికల నమోదులో స్వచ్ఛందమని, అది ఇవ్వలేదనే కారణంతో ఒక్కరి పేరు తొలగించరాదని ఎన్నికల సంఘం గతంలో స్పష్టం చేసింది. అదే సమయంలో ఆధార్ ఒక్కటే పౌరసత్వం లేదా ప్రస్తుత సాధారణ నివాసాన్ని నిర్ధారించే తుది పత్రం కాదన్న చట్టపరమైన పరిమితి ఉంది. అయినా ఇప్పటికే ఈపిక్, మొబైల్ వివరాలు, ఇతర ప్రభుత్వ రికార్డులు ఉన్న ఓటరిని ప్రతి దశలో మళ్లీ మొదటి నుంచి నిరూపించమనే విధానం ఎంత సముచితమన్న ప్రశ్న మిగులుతోంది. డూప్లికేట్ ఎంట్రీ ఉంటే ప్రస్తుత నివాసం ఏదో నిర్ధారించి సరైన నమోదును కొనసాగించే సులభమైన, తక్కువ భారమైన వ్యవస్థ ఉండాలన్న డిమాండ్‌కు ఇక్కడ బలం పెరుగుతోంది.

ఈ మొత్తం వివాదంలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా తన రాజకీయ దాడిని మరింత విస్తరించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కర్ణాటకలోని మహదేవపుర ఓటర్ల జాబితాను చూపిస్తూ డూప్లికేట్ పేర్లు, తప్పుడు చిరునామాలు, ఒకే చిరునామాలో పెద్ద సంఖ్యలో నమోదులు ఉన్నాయని గతంలో ఆరోపించారు. ఒక లక్షకు పైగా అనుమానాస్పద ఓట్లు ఉన్నాయని ఆయన చేసిన వాదనను కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారి అంగీకరించలేదు.. ఆధారాలు, చట్టబద్ధ డిక్లరేషన్ సమర్పించాలని కోరారు. కొన్ని ఉదాహరణలపై గ్రౌండ్ రిపోర్టుల్లో భిన్న వివరాలు బయటపడ్డాయి. అందువల్ల

- ఈసీఐలో విభేదాలు.. బయట మాత్రం ఏకాభిప్రాయం
- కాంగ్రెస్ ఆరోపణలు.. ఎన్డీఏ నుంచి గట్టి మద్దతు
- ఓటు కాపాడుకోవడానికే సామాన్యుడికి అదనపు ఖర్చా..
- వ్యవస్థ తప్పితే మూల్యం ఓటరే చెల్లించాలా..
- ఈసీనెట్‌పై అబ్జెక్షన్స్.. చివరకు ఇండిపెండెంట్ రివ్యూ
- ఓటర్ల కోసమా వ్యవస్థలు.. వ్యవస్థల కోసమా ఓటర్లు
- కోర్టు మెట్లెక్కితేనే దక్కాలా ఓటు హక్కు



2లో



(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్ ఆరోపణలు రాజకీయంగా తీవ్రమైనవైనా, ప్రతి క్లెయిమ్ నిర్ధారిత వాస్తవమని చెప్పలేని స్థితి కొనసాగింది.

అయితే కర్ణాటకలోని అలంద్ ఘటన కాంగ్రెస్ లేవనెత్తిన మరో కోణాన్ని మరింత సంక్లిష్టం చేసింది. ఓటర్ల పేర్లు తొలగించేందుకు ఆన్‌లైన్‌లో వచ్చిన 6 వేలకుపైగా ఫారం 7 దరఖాస్తులను అధికారులు పరిశీలించగా, వాటిలో అత్యధికం తప్పుగా తేలి తిరస్కరించబడ్డాయని కర్ణాటక ఎన్నికల కార్యాలయం స్వయంగా తెలిపింది. సంబంధిత లాగిన్ వివరాలు, మొబైల్ నంబర్లు, ఐపీ అడ్రస్‌లు, దరఖాస్తు రిఫరెన్సులు పోలీసులకు ఇచ్చామని కూడా పేర్కొంది. రాహుల్ గాంధీ దీనిని వ్యవస్థపై తన అనుమానాలకు ఉదాహరణగా చూపగా, ఈసీఐ సమాచారం ముందే దర్యాప్తు సంస్థలకు ఇచ్చామని సమాధానమిచ్చింది. ఇక్కడ ఆరోపణ, ప్రతిస్పందన రెండింటినీ రికార్డు సమానంగా పరీక్షించాల్సిన అవసరం ఉంది.

కాంగ్రెస్ తాజా దాడిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగత నేపథ్యమూ రాజకీయ చర్చకు చేరింది. కేరళ మాజీ చీఫ్ సెక్రటరీ జిజి థామ్సన్ చేసిన ఆరోపణ ప్రకారం, ఇద్దరూ ప్రభుత్వ సేవలో ఉన్న సమయంలో జ్ఞానేశ్ కుమార్ తనను బీజేపీలో చేరి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారని చెప్పారు. ఈ ఆరోపణకు జ్ఞానేశ్ కుమార్ నుంచి ప్రజా స్పందన ఇంకా వెలువడలేదని తాజా రిపోర్టులు పేర్కొన్నాయి. ఇది నిర్ధారిత అధికారిక ఫైండింగ్ కాదు.. ఒక మాజీ ఉన్నతాధికారి చేసిన ఆరోపణ మాత్రమే. అయినా ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ఇప్పటికే జరుగుతున్న రాజకీయ వివాదంలో కాంగ్రెస్ దీన్ని జ్ఞానేశ్ కుమార్ స్వతంత్రతపై మరో ప్రశ్నగా ముందుకు తెస్తోంది.

జ్ఞానేశ్ కుమార్ నియామక ప్రక్రియపై కాంగ్రెస్‌కు ముందే అభ్యంతరాలు ఉన్నాయి. కొత్త చట్టం కింద ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉన్న సెలెక్షన్ కమిటీ ద్వారా ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఎంపికైనప్పుడు రాహుల్ గాంధీ తన విభేదాన్ని నమోదు చేశారు. ఇదే కారణంగా ఇప్పుడు ఈసీఐలోని ఇంటర్నల్ అబ్జెక్షన్స్ బయటకు రావడంతో కాంగ్రెస్ పాత నియామక విమర్శలను కొత్త పరిణామాలతో కలిపి చూస్తోంది. అయితే బీజేపీ, ఎన్డీఏ వర్గాలు దీనిని రాజకీయ లక్ష్యంతో సంస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నంగా అభివర్ణిస్తున్నాయి. అధికారపక్షం సమర్థన, ప్రతిపక్షం విమర్శ రెండింటికీ అతీతంగా కమిషన్ స్వయంగా రికార్డుతో వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఇక్కడ మరింత పెరుగుతోంది.

ఈసీఐ మాత్రం 14 అభ్యంతరాలను విభేదాలుగా చిత్రీకరించడం సరైంది కాదని చెబుతోంది. ముగ్గురు సభ్యుల కమిషన్‌లో భిన్న అభిప్రాయాలు నిర్ణయ ప్రక్రియలో సహజమని, ఎస్ఐఆర్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలు చివరికి ఏకగ్రీవంగానే ఆమోదించబడ్డాయని స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సంధు, వివేక్ జోషి సమావేశం తర్వాత అంతర్గత వ్యవహారాల్లో అజెండాలను ముందుగా పంపడం, మినిట్స్ నమోదు చేయడం, కొత్త ఐటీ మాడ్యూల్స్‌పై అధికారుల కమిటీ పరిశీలన వంటి మార్పులు ప్రకటించబడ్డాయి. దీంతో అసలు ప్రశ్న భిన్నాభిప్రాయాలు ఉన్నాయా అన్నదానికంటే, అవి ఎలా పరిష్కరించబడ్డాయి, ఏ సేఫ్‌గార్డ్స్ అమల్లోకివచ్చాయన్నదానిపైకిమారింది.

ఆ ప్రశ్నకే సమాధానంగా కనిపించేలా ఈసీనెట్‌పై ఇండిపెండెంట్ రివ్యూ నిర్ణయం వచ్చింది. సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి, ఐఐటీ లేదా ఐఐఐటీ నుంచి స్వతంత్ర నిపుణుడిని చేర్చి ప్లాట్‌ఫామ్ సంబంధిత చట్టాలు, రూల్స్‌కు అనుగుణంగా ఉందో లేదో పరిశీలిస్తామని ఈసీఐ ప్రకటించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారుల సూచనలతో ఇప్పటికే కొన్ని అప్‌గ్రేడ్లు చేశామని, ఫీల్డ్ అధికారులకు వారి స్టాట్యూటరీ పవర్స్‌కు అనుగుణంగా రోల్ బేస్డ్ యాక్సెస్ ఉందని కూడా తెలిపింది. అన్నీ సక్రమమేనని చెప్పడమే కాకుండా స్వతంత్ర సాంకేతిక పరిశీలనకు వెళ్లడం, ఇప్పుడు వ్యవస్థపై ఏర్పడిన ట్రస్ట్ డెఫిసిట్‌ను ఈసీఐ కూడా గమనించిందనేసంకేతంగాచూడవచ్చు.

ఈ పరిణామాల మధ్య ఈవీఎంలపై గతం నుంచి కొనసాగుతున్న రాజకీయ అనుమానాల నేపథ్యం కూడా విస్మరించలేనిది. ఈవీఎంల భద్రత, రాండమైజేషన్, స్టోరేజ్, కౌంటింగ్ వంటి దశల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అనేక సేఫ్‌గార్డ్స్ అమలులో ఉన్నాయని ఈసీఐ పదేపదే చెబుతోంది. అయినా ఎన్నికల ప్రక్రియపై కొంత వర్గాల్లో నమ్మక లోటు పూర్తిగా తొలగిపోలేదు. అలాంటి సమయంలో ఓటర్ రోల్స్ నిర్వహణ, ఈసీనెట్ యాక్సెస్, ఫారం మార్పులు, ఇంటర్నల్ అబ్జెక్షన్స్ వంటి అంశాలు బయటపడటం ట్రాన్స్‌పరెన్సీపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. ఒక సంస్థపై విశ్వాసం ఆదేశాలతో కాదు.. ప్రతి వివాదానికి స్పష్టమైన డేటా, ప్రక్రియ, సమాధానంతోనే బలపడుతుంది.

ప్రతి వివాదం చివరకు సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మెట్లెక్కాల్సి వస్తే అది ప్రజాస్వామ్య పరిపాలనకు ఆరోగ్యకరమైన సాధారణ పద్ధతి కాదు. కోర్టు రాజ్యాంగ రక్షణకు చివరి సేఫ్‌గార్డ్ కావచ్చు, కానీ ఓటరుకు సాధారణ సర్వీస్ కౌంటర్‌గా మారకూడదు. నోటీసు వచ్చిన వెంటనే కారణం స్పష్టంగా తెలియడం, బూత్ లెవల్ అధికారి సహాయం అందించడం, ఆన్‌లైన్‌లో సమాధానం ఇచ్చే అవకాశం ఉండటం, పొరపాటు తేలితే వెంటనే రిస్టోరేషన్ జరగడం, అప్పీల్ వ్యవస్థ సులభంగా ఉండటం పరిపాలనా బాధ్యత. ఈసీఐ తాజాగా డోర్‌స్టెప్ డాక్యుమెంట్ కలెక్షన్, హెల్ప్‌డెస్కులు, స్పెషల్ క్యాంపులు, ఆన్‌లైన్ హియరింగ్స్ బలోపేతం చేయడం ఈ అవసరాన్ని అంగీకరించిన చర్యలుగా కనిపిస్తున్నాయి.

అందుకే ఇదంతా.. చివరికి కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పోరుగా మాత్రమే మిగలదు. ప్రతిపక్షం చేసిన ప్రతి ఆరోపణ నిజమని ముందే అంగీకరించాల్సిన అవసరం లేదు.. అధికారపక్షం ఇచ్చే ప్రతి సమర్థనతో వివాదం ముగిసిపోయిందని కూడా చెప్పలేం. ఎన్నికల సంఘం ఏ పార్టీకి అనుకూలంగా నిలవాల్సిన సంస్థ కాదు, ఏ పార్టీ విమర్శకు భయపడాల్సిన సంస్థ కూడా కాదు. కానీ కోట్ల మంది ఓటర్ల హక్కును నిర్వహించే రాజ్యాంగ సంస్థగా ఆరోపణ వచ్చిన ప్రతిసారి రికార్డు, డేటా, చట్టం, టెక్నికల్ ఆడిట్‌తో క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత దానిదే. తప్పు ఓటును తొలగించడం ఎన్నికల శుద్ధి అయితే, ఒక్క నిజమైన ఓటును కూడా తప్పుగా కోల్పోనివ్వకపోవడం ప్రజాస్వామ్య రక్షణ.



అవసరమైనంత నీటినే వినియోగించడం మంచి అలవాటు మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కూడా. ట్యాపులను నిర్లక్ష్యంగా వదలకుండా, గృహ అవసరాల్లో నీటిని మితంగా వాడాలి. వృథా అయ్యే ప్రతి చుక్క భవిష్యత్తులో కొరతగా మారవచ్చు. నీటిని జాగ్రత్తగా వినియోగిద్దాం... ప్రతి చుక్కకు విలువనిస్తూ భవిష్యత్తును భద్రపరుద్దాం.

# సరికొత్త శిఖరాలకు భారత్-కెనడా బంధం

## - విదేశాంగ మంత్రి జైశంకర్



భారత్, కెనడాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌తో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఫలప్రదమైన చర్చలు జరిపారు.

ఈ భేటీ అనంతరం జైశంకర్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ—"యూఎన్‌జీఏ 81వ సమావేశాల నేపథ్యంలో కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌తో సమావేశం కావడం ఎల్లప్పుడూ సంతోషకరం. ఇరు దేశాల సంబంధాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లే సన్నాహకాల్లో భాగంగా మా మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయి" అని పేర్కొన్నారు.

**డిసెంబర్‌లో మోదీ కెనడా పర్యటన?**

ఈ ఏడాది డిసెంబర్‌లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కెనడాలో పర్యటించే అవకాశముందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. యూఎన్‌జీఏ వేదికగా గత 22న నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల్లో మంచి పురోగతి కనిపిస్తోందని వెల్లడించారు. భారత్‌తో సంబంధాలు కేవలం వాణిజ్యం, ఆర్థిక రంగానికే పరిమితం కాకుండా ప్రజా సంబంధాలు, భద్రత వంటి అనేక అంశాల్లో అత్యంత ప్రాధాన్యమైనవని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు, డిసెంబర్ 14–15 తేదీల్లో అమెరికాలోని ఫ్లోరిడా డోరల్‌లో గల ట్రంప్ నేషనల్ రిసార్ట్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆతిథ్యంలో జీ20 సదస్సు జరగనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనపై ప్రాధాన్యత నెలకొంది.




© 2026 CVSR Digital News | cvsr.in | Privacy Policy | Terms & Conditions